

నేడు ఆడలి వ్యూ పాయింట్ ప్రారంభం

సీతంపేట రూరల్: సీతంపేటలోని ఆడలి వ్యూ పాయింట్‌ను ఎమ్మెల్యే జయకృష్ణ, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ప్రారంభించనున్నారని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతంపేటలో మరిన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవానికి జిల్లా గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

మన్యం.. పర్యాటక మణిహారం

- జిల్లాలో ఎన్నో సందర్శక ప్రాంతాలు
- మరింత అభివృద్ధికి అడుగులు వేస్తేనే ప్రగతి

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం


సీతంపేట రూరల్: నూతనంగా అభివృద్ధి చేయాల్సిన పాల్ల వ్యూ పాయింట్

జిల్లా పర్యాటక అందాలకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో సందర్శక ప్రాంతాలు ఉన్నాయి. పచ్చటి కొండలు.. ఆహ్లాదనిచ్చే జలపాతాలు.. కట్టిపడేసే ఏజెన్సీ అందాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు మన్యం సొంతం. ఆడలి వ్యూ పాయింట్, ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కు, పెద్దగెడ్డ, తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్లు, బెన్నరాయి, హనుమబారిబంద, గోముఖి, రాంధారి, దండిగాం, కురుకూటి, కుంబిమడ, గాలిగబడారు జలపాతాలు, పొల్ల వ్యూ పాయింట్, నున్నపుగెడ్డ వాటర్‌ఫాల్స్, ఏవోబీలోని తూర్పు కనుమలు, కొఠియ కొండలు, ఎస్‌కేపాడు హార్టికల్చర్ నర్సరీ, తాడికొండ వాటర్‌ఫాల్స్, తోటపల్లి వెంకటేశ్వర, పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానాలు ఇలా పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. కాగా, ఇంతవరకు పర్యాటకశాఖ వీటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరకొరగా సౌకర్యాలు కారణంగా.. పలు ప్రదేశాలు పర్యాటకుల తాకిడి లేక కళావిహీనంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శుక్రవారం 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా.. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు.. వాటి ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర కథనాలు..

7లో..


సాలూరురూరల్: దండిగాం జలపాతం

రైల్వే గేటు పడితే.. అరగంట ఆగాల్సిందే!

అక్కడ రైల్వే గేటు పడితే సుమారు అరగంట ఆగాల్సిందే. అత్యవసరంగా వెళ్లే వాహనాలైనా గేటు తీసేవరకూ నిరీక్షించాల్సిందే. ఎంత దూరం నుంచి వచ్చినా, పక్క ప్రాంతం నుంచి వచ్చినా వాహనాలకు బ్రేక్ వేయాల్సిందే. పార్వతీపురంలోని బెలగాం రైల్వేగేటు వద్ద దశాబ్దాల కాలం నుంచి తిష్ఠవేసిన సమస్య ఇది. ఇక్కడ అండర్ పాస్ బ్రిడ్జి గానీ, ఫ్లైఓవర్ గానీ నిర్మించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

(బెలగాం)



- బెలగాం వద్ద వాహనదారులకు కష్టాలు
- ఇరువైపులా నిలిచిపోతున్న ట్రాఫిక్
- ఫ్లై ఓవర్ నిర్మించాలని ప్రజల విన్నపం

పార్వతీపురం జిల్లా కేంద్రంగా ఏర్పడంతో జనసాంద్రత పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరిగింది. రోజురోజుకూ వాహనాలు పెరుగుతుండడంతో బెలగాం వద్ద రైల్వే గేటు పడిన సమయంలో భారీగా ట్రాఫిక్ జాం అవుతుంది. పార్వతీపురం పట్టణంలో భాగమైన బెలగాంతో పాటు బాలగుడబ, పెదగుడబ, చినగుడబ తదితర 25 గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే, రైళ్ల రాకపోకలు సాగించే వేళల్లో బెలగాం వద్ద ప్రతీసారి దాదాపు అరగంటకి పైగా రైల్వే గేటు పడుతుంది. దీంతో అటుగా వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల మూడో లైన్ కూడా వేయడంతో రైళ్ల రద్దీ మరింత పెరిగింది. నిత్యం వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు కార్యాలయాలకు, వివిధ పనుల నిమిత్తం ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేటప్పుడు గేటు పడిందంటే వారు ఆలస్యంగా అక్కడకు చేరుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులన్నీ గేటు అవతల వైపు ఉండడంతో బెలగాం వాసులతో పాటు 25 గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులకు సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే చాకలి బెలగాంలో విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. రైల్వే ట్రాక్ వల్ల సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేమని భయపడి తక్కువ సంఖ్యలో విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి బెలగాం గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి గానీ ఫ్లైఓవర్ గానీ నిర్మించాలని కోరుతున్నారు.

● అమృత భారత్ ప్రాజెక్టుకు పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ ఎంపికైంది. ప్రస్తుతం ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నారు. అందులో భాగంగా పట్టణ బైపాస్ రోడ్డు నుంచి పార్వతీపురం (బెలగాం) స్టేషన్‌కు అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఇది ఇంకా వినియోగంలోకి రాలేదు. ఇది బెలగాం గేటుకు కిలో మీటర్ దూరంలో ఉంటుంది. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలంటే ఇక్కడ నుంచి అర కిలో మీటరు దూరం మాత్రమే ఉంటుంది. అదే కొత్తగా వేసిన అండర్ బ్రిడ్జి నుంచి వెళితే దూరం అవుతుంది.


బెలగాం వద్ద రైల్వే గేటు పడడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

ఇబ్బందులు పడుతున్నాం..



బెలగాం వద్ద రైల్వే గేటు పడితే అరగంట వరకూ వేచి ఉండాల్సి వస్తోంది. మార్కెట్, ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులకు గురవుతున్నాం. అత్యవసర వైద్య సేవల నిమిత్తం రోగులను తరలించే అంబులెన్స్‌లు సైతం అరగంట పాటు నిలిచిపోవల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వెంటనే అండర్ బ్రిడ్జిని నిర్మించాలి.

-ఎం.తవిటినాయుడు, బెలగాం

ట్రాఫిక్‌తో అవస్థలు..



ఈ మార్గంలో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో గేటు పడితే భారీగా ట్రాఫిక్ జాం అవుతుంది. చాలా సమయం వేచి ఉండాల్సి వస్తుంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల మీద పట్టణంలోకి వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అండర్ పాస్ బ్రిడ్జి గానీ, ఫ్లై ఓవర్‌గానీ నిర్మించాలి.

-బి.మురళి, బెలగాం

కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలకు
పటిష్ఠ బందోబస్తు

- 2 నుంచి ట్రాఫిక్ మళ్లింపు
- భక్తులు సహకరించాలి
- డీఎస్పీ రాంబాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, సెప్టెంబరు 26: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు 210 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించనున్నట్లు డీఎస్పీ రాంబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమ్మవారిని సుమారు 30 వేల మంది భక్తులు దర్శనం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఉత్సవాల నేపథ్యంలో అక్టోబరు 2 నుంచి 12 వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. రాజాం వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద, శ్రీకాకుళం వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో, వీరఘట్టం వైపు నుంచి వాహనాలను వీరఘట్టం జంక్షన్ వద్ద ఖాళీ స్థలంలో, సీతంపేట వైపు నుంచి వచ్చే వాహనాలను ఆర్డీవో ఆఫీస్ వద్ద ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కోటదుర్గమ్మ గుడి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్న దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రజలు, కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. వీరఘట్టం జంక్షన్ నుంచి ఏలాం జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తోపుడుబళ్లు, పళ్ల దుకాణాలు, టిఫిన్ షాపులను దసరా ఉత్సవాలు ముగిసే వరకూ వేరేచోట పెట్టుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు దొంగతనాలు జరగకుండా మఫ్టీలో పోలీసులు గస్తీ కాస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి పాల్గొన్నారు.

సిరిమాను చెట్టు
రేపు నగరానికి రాక



విజయనగరం రూరల్, సెప్టెంబరు 26: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, నడిచే దేవతగా పేరొందిన పైడిమాంబ సిరిమాను చెట్టు శనివారం నగరంలోకి రానుంది. ఈ ఏడాది చింతమాను చెట్టును డెంకాడ మండలం పెదతాడి వాడలో మజ్జి వారి కళ్లాల్లో గుర్తించిన విషయం తెలిసిందే. అక్కడ ఇప్పటికే పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆ చెట్టును విజయనగరం తీసుకువచ్చే ప్రక్రియ శనివారం చేపట్టను న్నారు. ఈ మేరకు ఆలయ ఈవో డీవీవీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, నగరపాలక సంస్థ, విద్యుత్, అగ్నిమాపకశాఖ, దేవదాయ శాఖలకు ఇప్పటికే పైడిమాంబ దేవస్థానం సమాచారం ఇచ్చింది. ఈమేరకు వారంతా శనివారం ఉదయం డెంకాడ మండలంలోని పెదతాడివాడకు చేరుకోనున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు పూజల అనంతరం చెట్టును కొట్టే తంతు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్న సమారాధన జరగనుంది. సిరిమాను చెట్టు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో పెదతాడివాడ నుంచి బయలుదేరనుంది.

రూట్‌మ్యాప్ ఇలా..

సిరిమాను చెట్టు పెదతాటివాడ జంక్షన్ నుంచి జమ్ము జంక్షన్ వద్ద నగరంలోకి వస్తుంది. అక్కడ భక్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలకడంతో పాటు ప్రత్యేక పూజ చేస్తారు. అనంతరం నగరంలోని విద్యుత్ భవన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి ఎఫ్‌సీఐ గోదాం, ధర్మపురి ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్, అంబేడ్కర్ కూడలి, మయూరి కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు, పైడిమాంబ వనంగుడి, సీఎంఆర్ జంక్షన్, ఎస్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం, మూడులాంతర్లు, పాత సోనియా సెంటర్, శివాలయం వీధి, పైడిమాంబ కల్యాణమండపం, పార్కుగేటు, సుద్దవీధి జంక్షన్ మీదుగా ఆలయ అర్చకుడు బంటుపల్లి వెంకటరావు నివాసం ఉంటున్న హుకుంపేటకు చేరుతుంది. అక్కడ ఈ చింతమాను చెట్టును సిరిమానుగా మలిచే ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం అవుతుంది. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం వారసత్వంగా వస్తున్న కార్పెంటర్లు సిరిమానుగా మలిచే పని ప్రారంభిస్తారు.

ఎన్టీఆర్ గృహాలకు మోక్షం

- బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం
- రీవెరిఫికేషన్ చేస్తున్న హౌసింగ్ సిబ్బంది
- జిల్లాలో 10,596 ఇళ్లు
- లబ్ధిదారుల్లో ఆనందం

(జియ్యమ్మవలస)

కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2016 నుంచి 2018 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ కల్ప పథకంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలామంది పేదలకు ఎన్టీఆర్ ఇళ్లు మంజూరయ్యాయి. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ ఇళ్లకు బిల్లులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో లబ్ధిదారులు గగ్గోలు పెట్టారు. చేసేది లేక అప్పులు చేసి కొందరు ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరు మధ్యలో నిలిపివేశారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారందరూ గత వైసీపీ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వానికి నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయడానికి మూడున్నరేళ్ల కాలం పట్టింది. ఆ గృహాలు కూడా ప్రధానమంత్రి ఆవాస యోజన కింద మంజూరైనవే. వాటికి కూడా బిల్లులు సక్రమంగా చెల్లించలేదు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా మంజూరు చేసిన ఇళ్లతో పాటు 2014-19 మధ్య కాలంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఎన్టీఆర్ గృహాల ఫిజికల్ రీవెరిఫికేషన్‌కు ఆదేశాలిచ్చింది. దీంతో గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది ఆ పనిలో తలమునకలై ఉన్నారు. ఈ నెలాఖరులోగా రీవెరిఫికేషన్ పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఇదీ జిల్లాలో పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. ఇందులో వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని మండలాలు శ్రీకాకుళం జిల్లా నుంచి వేరుపడి మన్యం జిల్లాలో కలిశాయి. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో పార్వతీపురం జిల్లాకు 10,596 గృహాలు మంజూరయ్యాయి. వీటికి రూ. 1,217.20 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ గృహాల్లో బిలో బేస్‌మెంట్ లెవెల్ (బీబీఎల్)లో 1,284 ఇళ్లు, బేస్‌మెంట్ లెవెల్ (బీఎల్)లో 2,251, లింటల్ లెవెల్ (ఎల్‌ఎల్)లో 28, రూఫ్ లెవెల్ (ఆర్‌ఎల్)లో 650, రూఫ్ కంప్లీటెడ్ (ఆర్‌సీ)లో 7,119, పూర్తయిన ఇళ్లు 534 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 5,005 ఇళ్లకు సంబంధించి ఫిజికల్ రీవెరిఫికేషన్‌ను గృహ నిర్మాణశాఖ అధికారులు పూర్తి చేశారు. ఇంకా 5,563 ఇళ్లు రీవెరిఫికేషన్ చేయాల్సి ఉంది. మొత్తం 10,596 గృహాల్లో 28 గృహాలు ఇన్ ఎలిజిబుల్‌లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే సమయం దగ్గర పడుతుండటంతో ఫిజికల్ రీవెరిఫికేషన్‌లో నిమగ్నమై ఉన్నారు. త్వరగా రీవెరిఫికేషన్ పూర్తి చేస్తే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో అత్యధికంగా పాలకొండ మండలంలో 1,045 ఇళ్లకు గాను రూ.2.26కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇంతవరకు 663 ఇళ్లు వెరిఫికేషన్ పూర్తి చేయగా, ఇంకా 379 గృహాలకు పూర్తి చేయాల్సి ఉంది. అలాగే బలిజిపేట మండలంలో 1,015 ఇళ్లు మంజూరు కాగా రూ.76.78 లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ 1,015 గృహాలకు గాను 753 ఇళ్లకు రీవెరిఫికేషన్ పూర్తయింది. ఇంకా 253 ఇళ్లకు చేయాల్సి ఉంది.


జియ్యమ్మవలసలో రీవెరిఫికేషన్ చేస్తున్న గృహ నిర్మాణ శాఖ సిబ్బంది

ఎంత బిల్లులు చెల్లిస్తారో?

ఎన్టీఆర్ గృహాలకు ఎంతమేర బిల్లులు చెల్లిస్తారనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. 2014-19 మధ్య కాలంలో ఒక్కొక్క గృహానికి రూ.2.50 లక్షలు చొప్పున చెల్లించేవారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లించింది. అయితే, ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నూతన గృహాలకు ఒక్కొక్క దానికి రూ.4 లక్షలు చెల్లించేందుకు అంగీకరిస్తూ తీర్మానం చేశారు. అయితే, ఎంత అనేది ఇంకా గృహ నిర్మాణశాఖ అధికారులు కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. దీంతో లబ్ధిదారుల్లో కొంత గందరగోళం నెలకొంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం..

ఎన్టీఆర్ గృహాల ఫిజికల్ రీవెరిఫికేషన్‌ను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనిపై పూర్తి దృష్టి సారించాం. బిల్లులు విషయం ఇంకా స్పష్టత రాలేదు.

-ఎల్.ఉమామహేశ్వరరావు,
ఏఈ, గృహ నిర్మాణశాఖ, జియ్యమ్మవలస


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సదరం శిబిరాలు ఏర్పాటు చేస్తాం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


పార్వతీపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకు జిల్లాలో సదరం శిబిరాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పింఛన్లు, బస్సు, రైలు పాస్‌లు అందిస్తున్నట్టు తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు చెప్పారు. సీనియర్ సిటిజన్లు సామాజిక సంపద అని అన్నారు. వారి అనుభవాలను అందించి మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. అక్టోబర్ 2 నుంచి నిర్వహించనున్న సుందర పార్వతీపురం కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు పాల్గొనాలన్నారు. ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ట్రాన్స్‌జెండర్లు కోరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం 49 ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను అందించారు. జిల్లాలో 17,034 మంది దివ్యాంగులకు, 129 మంది ట్రాన్స్‌జెండర్లు, 7,9498 మందికి వృద్ధాప్య పింఛనుల అందిస్తున్నట్టు చెప్పారు. దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నట్టు తెలిపారు. వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, మూడు చక్రాల మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్లు, లాప్‌టాప్ తదితర ఉపకరణాలను అందించినట్టు వివరించారు. ఈ సమావేశంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఏఎస్పీ అంకితసురానమహావీర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, రెడ్ క్రాస్ చైర్మన్ ఎం.శ్రీరామ్మూర్తి, కమిటీ సభ్యులు గణపతిరావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు మొదటి ప్రాధాన్యం..

గ్రామాల్లో రోడ్డు పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మంజూరైన ఇంజనీరింగ్ పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. గిరిజన, మారుమూల గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా రహదారి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అవసరం లేని పనులను రద్దు చేసి కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆ లోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. 'గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వాణీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా... పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

అప్‌డేట్స్


మా మనవడినీ ఆదరించండి

- పరుచూరి బ్రదర్స్



సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచయమవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు



ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/ బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం - 530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

దిక్సూచి

ఐఐఎఫ్‌టీలో పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 5
- వెబ్‌సైట్: www.iift.ac.in





కొఠియా గ్రూప్‌లో గాలిగబడారు జలపాతం

ఆకుపచ్చని అందాలు..

జలపాతాల హొయలు!

పచ్చని ప్రకృతి సోయగాలు... ఆ నడుమ జలపాతాల హొయలు... చారిత్రక ప్రసిద్ధిగాంచిన ప్రదేశాలు... ఆధ్యాత్మిక క్షేత్రాలు... నిత్యం కళకళలాడే జలాశయాలు... ఇవీ ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకతలు. కాసింత శ్రద్ధ చూపితే... కొంచెం అభివృద్ధి చేసి చూపితే... పర్యాటకులు క్యూ కట్టే ప్రదేశాలు అనేకం ఈ జిల్లాల సొంతం. ముఖ్యంగా అటవీ ప్రాంతాల అందాలు చూపరుల మనసును దోచుకుంటాయనడంలో సందేహం లేదు. ఆ ప్రాంతాల విశిష్టతలు... విశేషాలు తెలుసుకుందాం.

- ఇదీ ఉమ్మడి జిల్లాల ప్రత్యేకత
- మన్యం సొగసులు చూడాల్సిందే
- పర్యాటక అభివృద్ధికి అడుగులు వేస్తేనే ప్రగతి

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

జలపాతాలు చూస్తారా?

సాలూరు రూరల్: సాలూరు ఏవోబీ ప్రకృతి అందాలకు పెట్టని కోట. పర్యాటకంగా సాలూరు ఏజెన్సీని అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. గిరిజనులకు ఉపాధి అవకాశాలు... పర్యాటకులకు ఆనందం సొంతమవుతాయి. ఏవోబీ కొండలు జలపాతాలకు పుట్టినిల్లు. సాలూరు మండలం లొద్ద వద్ద హనుమబారిబంద జలపాతం... శిఖపరువు గోముఖి జలపాతం, దళాయివలసలో రాంధారి, దండిగాంలో శివ, కురుకూటి, కుంబిమడ జలపాతాలు ఉన్నాయి. కొఠియాకు సమీపంలో తూర్పు కనుమల్లో ఎత్తయిన ఒడిశా దేవ్‌మాలి పర్యాటక ప్రదేశం ఉంది. సాలూరు మండలం సారిక, నేరేళ్లవలస, కొఠియా మీదుగా ఈ ప్రాంతానికి పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కొఠియాకు సమీపంలో గాలిగబడారు జలపాతం ఉంది. దీనిని ఒడిశా పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడం విశేషం. శిఖపరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే...ఈ ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పర్యాటకానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఐక్యరాజ్యసమితి నిర్ణయం మేరకు 1980 నుంచి ఏటా సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థికపరమైన విలువలను ప్రపంచ దేశాల మధ్య పరస్పరం పంపిణీ చేసుకునేందుకు పర్యాటక దినోత్సవాన్ని వేదికగా చేసుకుంటున్నారు. ఏటా ఒక్కో నినాదం... లక్ష్యంతో ఒక్కో దేశం ఈ కార్యక్రమాన్ని తమ భుజస్కంధాలపై వేసుకుంటోంది. ఈ ఏడాది మన దేశం ఆధ్వర్యంలో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం గమనార్హం.



పార్కు ప్రాంతంలో ఒరిగిన మొక్కలు

నేడు శ్రీకారం...

సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దీనిలో భాగంగా ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆడలి వ్యూ పాయింట్, ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో 5డి థియేటర్‌ను ప్రారంభించేందుకు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలు పర్యావరణ హితంగా ఉండాలని... గిరిజన సంస్కృతి... సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వాగత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కొత్తగా మరికొన్ని...

సీతంపేట ఏజెన్సీలో ఇంతకుముందు ఉన్న పర్యా టక ప్రాంతాలతో పాటు బెన్నరాయి జలపాతం, పొల్ల వ్యూ పాయింట్, సున్నపు గెడ్డ జలపాతం అభివృద్ధి చేసేందుకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సిద్ధమవుతోంది. జగతిపల్లి రిసార్ట్స్ పనులను రూ.6.6 కోట్లతో పునఃప్రారంభానికి టెండర్లు పిలవాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అటవీ శాఖ నుంచి అడ్డంకులు..

బెన్నరాయి, సున్నపుగెడ్డ జలపాతాలు, పొల్ల వ్యూ పాయింట్‌లను తీర్చిదిద్దేందుకు అధికారులు సిద్ధమవుతున్న నేపథ్యంలో అటవీ శాఖ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. సున్నపుగెడ్డ అభివృద్ధికి రూ.70 లక్షలు, పొల్ల వ్యూ పాయింట్‌కు రూ.20 లక్షలు, బెన్నరాయికి రూ.40 లక్షలు అందుబాటులో ఉన్నాయి. ఈ పర్యాటక ప్రాంతాలు పూర్తిగా రిజర్వ్ ఫారెస్టులో ఉండడంతో అటవీ శాఖ అనుమతి లేని కారణంగా ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అటవీశాఖ అభ్యంతరాల సమస్యను పరిష్కరిస్తే రానున్న రోజుల్లో సీతంపేట ఏజెన్సీ ప్రాంతం పర్యాటక హబ్‌గా మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.



బెన్నరాయి జలపాతం అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు (పాత చిత్రం)

అటవీ శాఖ ఆధ్వర్యంలోనే...

ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి సంబంధించి అటవీశాఖ అభ్యంతరాలపై డీఎఫ్‌ఓ తవిటినాయుడు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా... ఈ 3 పర్యాటక ప్రాంతాలు పూర్తిగా రిజర్వ్ ఫారెస్టులో ఉన్నాయని చెప్పారు. వీటి అభివృద్ధికి ప్రభుత్వం అటవీ శాఖకు అనుమతులు ఇచ్చిందన్నారు. మొదటిగా సున్నపుగెడ్డ జలపాతాన్ని పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్దేందుకు నిధులు వచ్చినట్లు తెలిపారు. మిగిలిన వాటి పనులు ప్రాధాన్య క్రమంలో జరుగుతాయని పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో తమ శాఖ ద్వారా టూరిజం అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.

సీతంపేట.. అందాల కోట

సీతంపేట రూరల్: ప్రకృతి అందాలకు పెట్టింది పేరు సీతంపేట మన్యం. పచ్చని కొండలు... స్వచ్ఛమైన మేఘాలు...ఇలా ప్రతి దృశ్యం మనసును హత్తుకుంటుంది. సీతంపేట ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడుగులు పడ్డాయి. సీతంపేటలో రూ.3 కోట్లతో ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్... రూ.55 లక్షలతో మెట్టుగూడ జలపాతం... రూ.7 కోట్లతో జగతిపల్లి రిసార్ట్స్‌ను అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించింది. వీటిలో జగతిపల్లి రిసార్ట్స్ సకాలంలో అందుబాటులోకి రాలేదు. గిరి శిఖర ప్రాంతం కావడం... రవాణా సమస్యలు తలెత్తడంతో రిసార్ట్స్ పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఇంతలో 2019 ఎన్నికలు రావడం... వైసీపీ అధికారం చేపట్టడంతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవరోధాలు ఎదురయ్యాయి. జగతిపల్లి రిసార్ట్స్ నిర్మాణ పనులకు రూ.40 లక్షలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం పరిసరాలు గాలిలో ఉండిపోయాయి. సీతంపేటలోని గిరిజన మ్యూజియం పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ తరుణంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మరలా ఈ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఇప్పుడిప్పుడే అడుగులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి కొత్త ప్రభుత్వంలో అడుగులు పడుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పర్యాటక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్‌కేపాడు హార్టికల్చర్ నర్సరీ అండ్ శిక్షణా కేంద్రం, తాడికొండ జలపాతం అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎస్‌కేపాడు హార్టికల్చర్‌లో యోగా కేంద్రం, బోటు షికారు, పద్మవ్యూహం పేరున వాకింగ్ ట్రాక్, రెస్టారెంట్లు, ట్రైబుల్ కల్చరల్ మ్యూజియం తదితర పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.కోటికి పైగా ఖర్చు చేశారు. తాడికొండ జలపాతం వద్ద మెట్లు, పగోడా నిర్మాణం పూర్తయ్యాయి. భవిష్యత్తులో ఈ రెండు కేంద్రాలను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా బాగుంటుంది. గిరిజన యువతకు ఉపాధి దొరుకుతుంది.




ఎస్‌కేపాడులో బాణం ఆకారంలో ఉన్న మెయిన్ గేట్



తాడికొండ జలపాతంలో యువత స్నానాలు

నేను... పెద్దగడ్డను

పాచిపెంట: పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిసరాలను పర్యాటక కేంద్రంగా మారుస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. పచ్చటి పైరులు, ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి సహజ సిద్ధ అందాలెన్నో ఇక్కడ కనువిందు చేస్తాయి. ప్రాజెక్టు పరిసరాలలో ఎత్తయిన కొండతో పాటు పురాతన మల్లికార్జునస్వామి ఆలయం, స్పిల్‌వే, ఎర్త్ డ్యాం పరిసర ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఎర్త్ డ్యాం పొడవునా వేసిన విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మల్లా మారాయి. 2016-17లో టూరిజం అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించారు. పార్కుతో పాటు సుందరీకరణ పనులు చేపడతామని చెప్పి.. మరచిపోయారు. బోటు షికారు కోసం రూ.3 లక్షలు వెచ్చించి బోటును ఏర్పాటు చేశారు. అది మున్నాళ్ల ముచ్చటగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది.



పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిసరాలు

తోటపల్లి... పట్టించుకోవాలి మళ్లీ

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉన్నా.. అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టలేదు. ఒకవైపు నాగావళి నది, మరోవైపు చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీవేంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాలు ఉన్నాయి. ప్రాజెక్టుకు సంబంధించి ఎడమ, కుడి ప్రధాన కాలువల మట్టికట్టలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. 2012లో సుంకికి ఆనుకుని కుడి ప్రధాన మట్టికట్ట దిగువ భాగంలో పర్యాటక పార్కును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని అభివృద్ధికి సుమారు రూ.41.92 లక్షలు మంజూరు చేసింది. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లక్ష్మీషా బోటు షికారు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్కుపై దృష్టి సారించలేదు. మొదట్లో పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడికి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు. అభివృద్ధి లేకపోవడంతో ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఏర్పడింది. జలాశయం గుర్రపు డెక్కతో నిండిపోవడంతో బోట్లు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. పార్కులో చిన్నారుల ఆట సామగ్రి మరమ్మతులకు గురయ్యాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

విశిష్ట చరిత.. వీర బొబ్బిలి ఘనత



శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో సందర్శనీయ స్థలాలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతానికి సందర్శకుల తాకిడి పెంచే విధంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాలు బాసలు చేశాయి. కానీ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. బొబ్బిలి విచ్చేసే సందర్శకులు రాజుల ఇలవేలుపైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని, కోట, గెస్ట్‌హౌస్‌లను సందర్శించడం పరిపాటి. బొబ్బిలి కోట, రాజావారి గెస్ట్ హౌస్‌లలో ప్రముఖ నటులు బాలకృష్ణ, వెంకటేశ్‌తో పాటు తమిళ హీరోల సినిమాల చిత్రీకరణలు జరిగాయి. బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో నాటి బొబ్బిలి యుద్ధానికి సంబంధించిన ఆయుధాలు, రాజుల బంగారు, వెండి సింహాసనాలు తదితర వాటితో మ్యూజియం ఏర్పాటు చేశారు.



బొబ్బిలి యుద్ధస్తంభం

బొబ్బిలిలో మరో సందర్శనీయ స్థలం యుద్ధ స్మారక స్థూపం. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పదేళ్ల క్రితం ఇక్కడ సుమారు రూ.30 లక్షలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనిని ఆనుకొని ఉన్న భైరిసాగరం చెరువులో బోటు షికారుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కులో గల మల్లమ్మ చెరువు (కోనేరు)లో బోటు షికారు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పర్యాటక శాఖ బుట్టదాఖలు చేసింది. బొబ్బిలి-సాలూరు పట్టణాల మధ్య రెండు రైలు బస్సులు నడిపేవారు. వీటిలో ప్రయాణించేటప్పుడు మార్గమధ్యలో పచ్చని పంట పొలాలు.... కొండలు... నదులు ఆహ్లాదాన్ని పంచేవి. కరోనా సమయం నుంచి ఈ రైలు బస్సును నిలిపివేశారు. దీనిని పునరుద్ధరించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. చారిత్రక ప్రసిద్ధిగాంచిన బొబ్బిలి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే... ఎంతో ఆకట్టుకునే అవకాశం ఉంది.

త్రివేణీ సంగమం... సుందర ప్రదేశం

వంగర: మడ్డువలస రిజర్వాయర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న నాయకుల మాటలు నీటి మూటలయ్యాయి. మూడు వైపులా కొండలు... ఆ నడుమ నీరు... కొండలను తాకే నీటిశబ్దాలతో కలిగే అనుభూతిని మాటల్లో చెప్పలేం. రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న కొండపై సాయినాథుని ఆలయం.. మరో కొండపై పాండవుల పంచలు ప్రత్యేక ఆకర్షణ. నాగావళి ... వేగావతి.. సువర్ణముఖి కలిసే త్రివేణి సంగమ ప్రాంతంలో సాక్షాత్తూ బలరాముడు నిర్మించిన సంగమేశ్వర ఆలయాలను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ప్రగతి సాధించవచ్చు. మడ్డువలస రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తామని మాజీ ముఖ్యమంత్రి జగన్, ఇతర మంత్రులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. దీని అభివృద్ధికి ఇంజనీరింగ్ అధికారులు రూ.4 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో అంచనాలు బుట్ట దాఖలయ్యాయి.




సంగాం ఆలయం

నిధులు రావలసి ఉంది..

కాటేజీల నిర్మాణం... బోటు షికారుకు సుమారు రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిర్మాణానికి అవసరమైన స్థలాలు గుర్తించాం. నిధులపై స్పష్టత లేదు.

-అర్జున్, ఈఈ, మడ్డువలస

తాటిపూడి... శ్రద్ధ కొరవడి!



పర్యాటకులతో కిటకిటలాడిన తాటిపూడి (ఫైల్)

గంట్యాడ: చుట్టూ కొండలు... మధ్యలో నీరు... అందరినీ ఆకట్టుకునే తాటిపూడి పర్యాటక కేంద్రం అభివృద్ధికి చాలా దూరంగా ఉంది. ఒకప్పుడు నిత్యం సందర్శకులతో కిటకిటలాడేది. ఇప్పుడు వెలవెలబోతోంది. ఈ ఏడాది వర్షాలు కురవడంతో రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీరు చేరడంతో కళకళాడుతోంది. 2000 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ మంగపతి రావు ఇక్కడ బోటు షికారును అందుబాటులోకి తెచ్చారు. గోస్తనీ సరోవర్ విహార్ పేరిట అప్పట్లో 8 బోట్లు తీసుకొచ్చారు. వీటిని తాటిపూడి గ్రామానికి చెందిన 8 మంది నడిపేవారు. ఎకో టూరిజం ఆధ్వర్యంలో మరో రెండు పెద్ద బోటులు ఏర్పాటు చేశారు. ఈ బోట్లను గిరిజనులు నడిపేవారు. ఇక్కడ బోటు షికారు కోసం నిత్యం అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చే వారు. కార్తీక మాసంలో వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చేవారు. రిజర్వాయర్ ఆవల ఎకో టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కాటేజీలు... గిరి వినాయక విగ్రహం, క్యాంటీన్ సదుపాయం కల్పించారు. మరోవైపు రిజర్వాయర్‌కు ఆవల ఉన్న గిరిజనులు వారి గ్రామాలకు బోటులో వెళ్లే వారు. తాటిపూడి అభివృద్ధికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటితో 2017 ఫిబ్రవరి మొదటి వారంలో పనులు ప్రారంభించారు. రిజర్వాయర్ వద్ద ఆర్చి, స్నాక్స్ షాపు, పగోడా, టిక్కెట్ కౌంటరు, మంచినీటి సదుపాయం, టాయిలెట్స్, బోట్లు, జట్టీలు ఏర్పాటు చేశారు. చక్కని రంగులు కూడా వేసేందుకు పనులు ప్రారంభించారు. తరువాత ఏమైందో తెలియలేదు కానీ ప్రారంభించిన కొద్ది రోజుల్లో పనులకు బ్రేకులు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం కూడా తాటిపూడి పర్యాటక కేంద్రంపై దృష్టి పెట్టలేదు. 2017 నవంబరులో కృష్ణానదిలో జరిగిన బోటు ప్రమాదంతో ఇక్కడ బోటు షికారు నిలిపివేశారు. అప్పటి నుంచి సందర్శకులు కూడా ఈ ప్రాంతానికి పెద్దగా రావడం లేదు. రిజర్వాయర్‌కు ఆవల గిరివినాయక కొండ వద్ద ఎకో టూరిజం ఆధ్వర్యంలో అభివృద్ధి చేయడానికి ఎస్‌డీపీ నుంచి సుమారు రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు కూడా నిలిచిపోయాయి. బొడ్డవరం నుంచి రహదారి సదుపాయం కల్పిస్తే సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం కూడా జరగలేదు. ఇకనైనా పాలకులు, అధికారులు ఇక్కడ పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఎంపీ కలిశెట్టికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీసుకున్నారు. గురువారం నాడు విశాఖపట్టణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ సభ్యత్వాన్ని స్వీకరించారు. టీడీపీ సంస్థాగత ప్రక్రియలో భాగంగా సాధారణ, క్రియాశీలక సభ్యత్వాలు ఉండేవి. ఈ పర్యాయం శాశ్వత సభ్యత్వాన్ని కూడా ఏర్పాటు చేశారు.

హింధూ ధర్మాన్ని పరిరక్షించాలి

రాజాం రూరల్: హింధూ ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని జనసేన ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్ బాబు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఇతర మతాలకు, వారి ఆచార, వ్యవహారాలకు భంగం కలగకుండా, మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గురువారం రాజాంలో అంబేడ్కర్ కూడలిలో నిరసన దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ: ఎస్పీ

విజయనగరం క్రైం: గుండెపోటుకు గురైన వారికి తక్షణమే సీపీఆర్ చేస్తే పునర్జన్మ అందించవచ్చునని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవంలో భాగంగా మెడికల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా సమాజానికి ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బందిని సీపీఆర్ నిర్వహించడంలో సుశిక్షితులను చేసేందుకు తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆసుపత్రి ఎంపీ డాక్టరు తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ ఇతరులను రక్షించేందుకు పోలీసు సిబ్బందికి తప్పనిసరిగా సీపీఆర్ విధానంపై అవగాహన ఉండాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లాలో భారీ వర్షం



విజయనగరం సమీపంలో కురుస్తున్న వాన

విజయనగరం(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఎండ ఉన్నా 11 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురుపల్లి, ఎస్.కోటతో పాటు పలు ప్రాంతాల్లో వాన పడింది. విజయనగరంలో కురిసిన వర్షానికి శివారు కాలనీలు, మార్కెట్ జలమయమయ్యాయి.

సబ్‌జైలును తనిఖీ చేసిన న్యాయాధికారి

బొబ్బిలి: స్థానిక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి బి.కళ్యాణచక్రవర్తి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడారు. వసతి, భోజన సౌకర్యాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జైలులో ఎంతమంది రిమాండ్ ఖైదీలు ఉన్నారు? ఎన్నాళ్ల నుంచి ఉన్నారు? ఏ నేరారోపణపై వచ్చారు? తదితర విషయాలను ఆరా తీశారు. ఖైదీల సంక్షేమం విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, న్యాయవాది సీహెచ్‌ఎల్‌వి ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య సాయం అందించాం

శృంగవరపుకోట: అస్వస్థతకు గురైన శృంగవరపుకోట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహ విద్యార్థులకు సకాలంలో వైద్య సాయం అందించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'వసతి గృహ విద్యార్థులకు అస్వస్థత' అనే వార్తకు ఆయన స్పందించారు. వసతి గృహం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. విరేచనాలతో బాధపడుతున్న విద్యార్థులను ఆరోగ్య కార్యకర్త ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారని తెలిపారు. చికిత్స పొందుతున్న విద్యార్థులంతా పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేణుగోపాల స్వామి ఆలయ రికార్డులు పరిశీలన

పూసపాటిరేగ: కోనాడ గ్రామంలో గల వేణుగోపాల స్వామి ఆలయ భూములపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై ఈవో జగదీశ్వరి, తహసీల్దారు గోవింద్ తదితరులు గురువారం స్పందించారు. ఆలయ రికార్డులను పరిశీలించారు. దేవదాయ శాఖలో గల భూములకు సంబంధించిన వివరాలు మాత్రమే వీరు ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. త్వరలోనే ఈ భూములలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించేందుకు రెవెన్యూ, అధికారులు, దేవదాయ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ భూములకు సంబంధించి వేలం నిర్వహిస్తే గానీ ఆక్రమణలు, నిజానిజాలు బయటకు వచ్చే అవకాశాలు లేవని అధికారులు నిర్ధారణకు వచ్చారు. శిస్తు బకాయిల వసూలుపై కూడా దేవదాయ శాఖ అధికారులు దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ: రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు తక్షణమే అందించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, రైతు సంఘ, సీఐటీయూ నాయకులు అప్పారావు, జయరాం, కృష్ణ విజయకుమార్, చిన్న నారాయణరావు, కాద రాము, వీరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో తనిఖీలు



బియ్యాన్ని కాటా వేయిస్తున్న అధికారులు

సీతంపేట రూరల్: సీతంపేటలో సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో విజిలెన్స్, తూనికలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ సీఐ జి.సింహాచలం, తూనికలు కొలతల శాఖ కమిషనర్ పి.రంగారెడ్డి, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి వై.రామయ్య ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. గోడౌన్‌లోని స్టాక్, వే బ్రిడ్జ్, సరుకుల నాణ్యత వంటి అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సరుకుల నాణ్యతపై శాంపిల్స్ తీశామని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని ఆహార భద్రత అధికారి రామయ్య తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై డీటీ సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

దాహం తీర్చండి

- రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

బెలగాం: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు గురువారం కూడా కొనసాగింది. ఈ దీక్షకు ఏపీఎస్ ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరామ్ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రజల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పార్వతీపురం పట్టణ ప్రజల దాహార్తి తీర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే అక్టోబర్ 1న చలో కలెక్టరేట్ చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, ఇందిరా, తులసి, గౌరి సీఐటీయూ నాయకులు వై.మన్మధరావు, సూరిబాబు, రాజశేఖర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.85 లక్షలు

పాలకొండ: పాలకొండ కోటదుర్గమ్మ హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. మొత్తం 22 రోజులకు గాను రూ.1,85,222 ఆదాయం వచ్చినట్లు ఈవో వీవీ హరిసూర్యనారాయణ తెలిపారు. జిల్లా దేవదాయశాఖ సీనియర్ సహాయకుడు ఎస్.రామారావు పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ లత, పోలీస్ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది ఉండకూడదు

కోటదుర్గమ్మ దసరా నవరాత్రులను వైభవంగా నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ ఈవో సూర్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీప్రసాదశర్మ, కౌన్సిలర్లు కడగల రమణ, వెన్నపు శ్రీనివాసరావు, కిల్లారి మోహన్‌రావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సిక్ రూమ్ తప్పనిసరి

పార్వతీపురం రూరల్: హాస్టళ్లలో సిక్ రూమ్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. గురువారం డోకిశీల గిరిజన సంక్షేమ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, కిటికీలకు మెస్‌లు బిగించాలని, ప్రతి రోజూ పిల్లల ఆరోగ్య స్థితిగతులను చూడాలని హాస్టల్ ఏఎన్ఎం శ్రీలేఖకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తనిఖీ చేశారు. మలేరియా మందులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్ కుమార్, విస్తరణాధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పిల్ల కాలువల్లో పూడిక తీయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాచిపెంట: పెద్దగెడ్డ జలాశయం పిల్ల కాలువల్లో పూడిక తీయాలని రైతులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ డి.రవికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ.. కాలువల్లో పిచ్చి మొక్కలు, పూడికలు తొలగించకపోవడంతో సాగునీరు సక్రమంగా అందడంలేదని పేర్కొన్నారు. పద్మాపురంలో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూము లకు సంబంధించి రైతులకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతినాయుడు, కార్యదర్శి బోను గౌరునాయుడు, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1.25 లక్షల విరాళం



ఎమ్మెల్యేకు నగదు అందిస్తున్న గూడెంవీధికి చెందిన టీడీపీ నాయకులు

సీతానగరం: సీతానగరం గూడెంవీధి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బి.భానుప్రసాద్, స్థానిక యువత విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచారు. బాధితులకు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. గురువారం ఎమ్మెల్యే విజయచంద్రకు ఈ నగదును అందజేశారు. అలాగే కాశీపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు టి.చంద్రశేఖర్‌రావు, కామేశ్వరరావు, తిరుపతి, రాంబాబు, సింహాచలం, గోపాల్, ఎల్లంనాయుడులు రూ. 25 వేలు విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

ప్రతీ గ్రూపునకు రూ.5 లక్షల రుణం

వీరఘట్టం: స్థానిక వెలుగు సమావేశ మందిరంలో గురువారం శ్రీనిధి రికవరీపై ఏజీఎం హేమలత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో అర్హులైన ప్రతీ గ్రూపునకు శ్రీనిధి రుణాలు రూ.2 లక్షల వరకు ఇచ్చేవారమని, ప్రస్తుతం రూ.5లక్షలు అందిస్తున్నామని తెలిపారు. మండలంలో శ్రీనిధి రికవరీ 90 శాతం ఉందని, వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఏపీఎం బి.శివునాయుడు, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కె.లలితమ్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

- స్వర్ణాంధ్రప్రదేశే చంద్రబాబు లక్ష్యం
- 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు జయకృష్ణ, విజయచంద్ర, జగదీశ్వరి







పాలకొండ కస్పావీధి, సీతానగరం మండలం వెంకంపేట, గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు జయకృష్ణ విజయచంద్ర, జగదీశ్వరి

పాలకొండ/సీతానగరం/గుమ్మలక్ష్మీపురం: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పాలకొండ, పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. పాలకొండ పట్టణం కస్పావీధి, ఆర్‌సీఎం చర్చి వద్ద గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ.. పాలకొండ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. సీతానగరం మండలం ఆర్.వెంకంపేట గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2047లో స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడ పంచాయతీలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన మంచిని వివరించి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నరకం?

- అధ్వానంగా ఉల్లిభద్ర ప్రధాన రహదారి
- గోతుల్లో దిగబడిపోతున్న వాహనాలు



ఉల్లిభద్ర వద్ద గోతిలో దిగబడిన ఆటో

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడే గోతులు ఉండడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. నిత్యం ఈ గోతుల్లో వాహనాలు దిగబడిపోతున్నాయి. దీనివల్ల ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోతుంది. భారీ గోతులు కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రధాన మార్గం ప్రమాదభరితంగా తయారుకావడంతో నిత్యం అవస్థలు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గురువారం ఓ గోతిలో ఆటో దిగబడింది. దీనివల్ల కొద్దిసేపు ఇరువైపులా వాహనాలు బారులుదీరాయి. తమకు ఈ కష్టాలు తప్పేదెప్పుడని? వాహనచోదకులు ప్రశ్నిస్తున్నారు.

పురుగు మందు పిచికారికి
డ్రోన్ వినియోగించుకోవాలి: కలెక్టర్



డ్రోన్ పిచికారి విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బెలగాం: పంట చేలలో పురుగు మందుల పిచికారికి రైతులు డ్రోన్లు వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. గురువారం చాకలి బెలగాంలోని ఓ రైతుకు చెందిన 20 ఎకరాల వరి పంటలో వ్యవసాయ శాఖ అధికారులు, రాస్తా కుటుంబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారి చేశారు. ఈ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు, చీడ పురుగులు నివారణ మందులు పిచికారి చేయడానికి జిల్లాలో డ్రోన్లు వినియోగించడానికి చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన డ్రోన్ పైలెట్లను వినియోగించుకుని రైతులకు మేలు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ అధికారి ఆర్.ధృవ, రైతు శిక్షణ కేంద్ర సహాయ సంచాలకుడు ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీసా చట్టం అవగాహనలో సదస్సులో
జిల్లా ఎంపీపీలు, సర్పంచ్‌లు



ఢిల్లీలో జరిగిన సదస్సులో తెలంగాణ మంత్రి సీతక్కతో గిరిజన సర్పంచ్‌లు

సీతంపేట రూరల్/గుమ్మలక్ష్మీపురం: న్యూఢిల్లీలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం పీసా చట్టంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీతంపేట మండల పరిషత్ అధ్యక్షుడు బిడ్డిక ఆదినారాయణ, పెద్దూరు సర్పంచ్ ఆదిలక్ష్మి, కొత్తగూడ సర్పంచ్ సుశీల, గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ దీనమయ్య, సర్పంచ్ గౌరీశంకరరావు హాజరయ్యారు.

పేర్నినాని వ్యాఖ్యలు తగవు

మక్కువ: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు తగవని సాలూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్‌ను పోతు పేరంటాలు అనడం తప్పు అని, ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే జనసైనికులు త్వరలోనే గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు సుగుణేశ్వరరావు, బంగారురాజు పాల్గొన్నారు.

ఎంఈవోల నియామకం

గరుగుబిల్లి: జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారుల నియామకాన్ని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆదేశాలను జారీ చేశారు. గరుగుబిల్లి మండల ఎంఈవో-1గా సాలూరులో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న డి.అప్పలనాయుడును నియమించారు. జియ్యమ్మవలసకు వై.విమలకుమారిని, గుమ్మలక్ష్మీపురం ఎంఈవో-2గా భామిని మండలానికి చెందిన వి.భాస్కరరావును నియమించారు. మూడు మండలాల్లో ఎంఈవోలు తక్షణమే విధుల్లోకి చేరాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి పగడాలమ్మ ఆదేశాలు జారీ చేశారు.

మెరుగైన సేవలందించాలి

బెలగాం: ఉద్యోగోన్నతి పొందిన పోలీసులు ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఉద్యోగోన్నతి పొందిన పలువురు పోలీసులు ఎస్పీని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐలుగా పనిచేస్తున్న షేక్ మస్తాన్, మణిబాబు ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందారు. అలాగే, విజయగనరం జిల్లా బాడంగి స్టేషన్‌లో పని చేస్తున్న హెచ్‌సీ డి.సన్యాసిరావును ఏఎస్‌ఐగా, ఏఆర్ఎస్‌గా పనిచేసిన కుమారస్వామికి ఆర్ఎస్ఐగా ఉద్యోగన్నతి కల్పించారు. వీరిని పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోన్నతి పొందిన వారు ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగోన్నతి పొందామంటే మరింత బాధ్యతగా పని చేయాలని ఎస్పీ అన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



జైలు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

బెలగాం: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ చక్రవర్తి అన్నారు. గురువారం పార్వతీపురం సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయ కళ్యాణి, రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదర రావు, పార్వతీపురం జైలు విజిటింగ్ అడ్వకేట్ టి.జోగారావు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఎస్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలకు కూరగాయల విత్తనాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు మొక్కల పెంపకం, సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించాలన్నారు. పండిన కూరగాయలను మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వండి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శేఖర్, జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం భీముడు, టీడీపీ నాయకుడు పాడి సుధ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భామిని: కొత్తూరు-బత్తిలి రహదారి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం భామినిలో రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. కొత్తూరు నుంచి బత్తిలి వరకు అడుగుకొక గుంతతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డుని బాగు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.జగన్నాథరావు, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవసాయ పాఠాలు

పాచిపెంట: చిన్నప్పటి నుంచే విద్యార్థులు వ్యవసాయ పాఠాలు నేర్చుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. గురువారం సరాయివలస ఏకలవ్య పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులే మట్టి నమూనాలు తీయాలన్నారు. కనీసం 50 మట్టి నమూనాలు తీసి విశ్లేషణకు పంపించాలన్నారు. ఒక ఎకరాలో ఐదు లేదా ఆరో చోట్ల 'వి' ఆకారపు 15 సెంటీ మీటర్ల గొయ్యి తవ్వి అంచుల వెంబడి మట్టిని తీసుకుని నీడలో ఆరబెట్టి మెత్తగా తయారు చేయాలన్నారు. విద్యార్థులు పెరటి తోటల పెంపకాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిగణేష్, ప్రకృతి సేద ఐసీఆర్‌పీ సుకరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ అన్నారు. గురువారం పెద్దూరు, గరుగుబిల్లి, పెదగుడబ పంచాయతీల్లోని ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఈ నెల 28న మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తుందన్నారు. మండలంలోని 25 పంచాయతీల పరిధిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. గతంలో మంజూరైన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయకుంటే రద్దయ్యే అవకాశం ఉందన్నారు. మండలానికి సంబంధించి 496 ఇళ్లకు గాను 168 నిర్మాణాలు పూర్తయ్యాయని గృహ నిర్మాణశాఖ జేఈ వంగపండు అఖిల్ తెలిపారు. పంచాయతీల పరిధిలో నిర్మాణాలు పూర్తికి ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో జి.పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో అధికారులు సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని రావివలస ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్ అన్నారు. గురువారం గ్రామ సచివాలయంలో స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్‌కు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. సచివాలయ కార్యదర్శి ఆర్.శశిభూషణరావు మాట్లాడుతూ.. 2047 విజన్‌కు సంబంధించి అవసరమైన విధి విధానాలను రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ బి.అప్పడు, వీఆర్వో ఆర్.వినాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామంలో గురువారం స్వర్ణాంధ్ర-2047పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధించేందుకు అందరూ కలసి కృషి చేయాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బి.కోటేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి డోకల శీను, మాజీ సర్పంచ్ వెంకటరమణ, అప్పలనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.